www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025

5

పశ్చిమ గోదావరి

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ దాసిరాజు హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డివిజన్లోని స్కానింగ్ సెంటర్లను దశల వారీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ స్వరూప్, నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, హెల్త్ అసిస్టెంట్ వై.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో వెండర్ మాయాజాలం..!

ఇ-గ్రామస్వరాజ్‌లో ఇష్టానుసారంగా వెండర్ అకౌంట్లు

ఒకే వ్యక్తికి ఒకచోట ఉద్యోగిగా, మరికొన్ని చోట్ల రెంటర్‌గా ఖాతాలు

నిడమర్రు మండలం క్రొవ్విడి, మండలపర్రు, గుణపర్రుల్లో వెండర్ ఖాతాలపై విస్మయం

మూడు పంచాయతీల్లోనూ ఒకరికే ఉద్యోగి, రెంటర్ ఖాతాలు

రూ.లక్షల సొమ్ము జమపై పలు అనుమానాలు

Village: Krovvidi

S.No.	Vendor	Vendor Type
1	AAO ERO TPG	Agency
2	CHODAVARAPU SAMSONU RAO	Employee
3	EESL	Agency
4	EESWARAPU RAMATULASI	Employee
5	KURMA RAMESH	Employee
6	MOLAGAJJALA YESU	Employee
7	MOTEPALLI VENKATA LAKSHMI	Employee
8	PALANKI SARSWATHI	Employee
9	Ravipati Madhavi Latha	Employee
10	Ravipati Srinivasa rao	Citizen

క్రొవ్విడి ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో ఉద్యోగులుగా మోటేపల్లి వెంకటలక్ష్మి, రావిపాటి మాధవీలత

7	Motepalli Venkata Lakshmi	Citizen
8	Ravipati Madhavi Latha	Citizen

Report generated through eGramSwaraj (http://egramswaraj.gov.in) on Mon, Jan 06, 2025 17:41:05 PM

మండలపర్రు ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో సిటిజన్లుగా మోటేపల్లి వెంకటలక్ష్మి, రావిపాటి మాధవీలత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామాల అభివృద్ధికి వెన్నుముకగా నిలవాల్సిన పంచాయతీల్లో నిధుల ఖర్చుకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తన శాఖను ప్రక్షాళ చేసి గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవలందించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు పదేపదే చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు జిల్లాల్లోని పంచాయతీలకు రూ.వంద కోట్లకుపైగా వచ్చాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల్లోని అభివృద్ధి పనులకు సక్రమంగా వినియోగించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రత్యేకంగా తెరిచిన ఇ-గ్రామస్వరాజ్‌లో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా వెండర్ అకౌంట్లు తెరిచి నిధులు జమ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెండర్ ఖాతాలకు నిధుల జమపై గ్రామాల్లో విస్తృతమైన చర్చ నడుస్తోంది. నిడమర్రు మండలంలోని క్రొవ్విడి, మండలపర్రు, గుణపర్రు పంచాయతీలకు సంబంధించి ఇ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో తెరిచిన వెండర్ ఖాతాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. ఈ మూడు పంచాయతీలకు కార్యదర్శి ఒక్కరే. క్రొవ్విడి పంచాయతీలో మోటేపల్లి వెంకటలక్ష్మి ఉద్యోగి (ఎంప్లాయి) కింద వెండర్ ఖాతా ఉండగా, మండలపర్రు, గుణపర్రు పంచాయతీల్లో రెంటర్ (సిటిజన్), వెండర్ ఖాతాలు ఉన్నాయి. రావిపాటి మాధవీలత పేరు క్రొవ్విడిలో ఉద్యోగిగా, మిగిలిన రెండు పంచాయతీల్లో రెంటర్‌గా ఖాతాలు ఉన్నాయి. ఒక పంచాయతీలో ఉద్యోగి ఖాతాగా సొమ్ము జమవుతుండగా, మరో పంచాయతీలో రెంటర్ ఖాతాగా నిధులు జమవుతున్నాయి. ఒక వ్యక్తి ఒకచోట ఉద్యోగిగా, మరోచోట రెంటర్‌గా ఏవిధంగా ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సదరు వ్యక్తులు క్రొవ్విడి పంచాయతీలో ఉద్యోగులుగా ఉన్నారా అనే విషయాలనుసైతం అధికారులు తేల్చాల్సి ఉంది. క్రొవ్విడి పంచాయతీలో మోటేపల్లి వెంకటలక్ష్మి వెండర్ ఖాతాలోకి దాదాపు రూ.పది లక్షలకుపైగా సొమ్ము 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో జమ కావడం ఆశ్చర్యం కల్గిస్తోంది. ఇంకా చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్ ఉన్నట్లు ఇ-గ్రామస్వరాజ్ ఖాతాలో చూపిస్తున్న పరిస్థితి ఉంది. ఇదేవిధంగా మండలపర్రు, గుణపర్రు పంచాయతీల్లోనూ నిధుల జమ సాగింది. గుణపర్రులో మోటేపల్లి వెంకటలక్ష్మి పేరున 2024 మార్చిలో రూ.24 వేలకుపైగా బిల్లు తాగునీటి కింద ఖర్చు పెడితే తిరస్కరణకు గురవ్వగా, ఏప్రిల్‌లో జీతాల పేరుతో బిల్లు పెట్టి క్లియర్ చేసుకున్నట్లు ఇ-గ్రామ స్వరాజ్ ఖాతాల్లో చూపిస్తోంది. క్రొవ్విడిలో ఉద్యోగిగా ఖాతా ఉన్న రావిపాటి మాధవీలతకు మండలపర్రు పంచాయతీ వెండర్ ఖాతాల్లో ఒకేసారి రూ.94,900 బిల్లు చెల్లింపు జరిగినట్లు చూపిస్తోంది. మరోవ్యక్తి రావిపాటి శ్రీనివాసరావు పేరున క్రొవ్విడిలో వెండర్ ఖాతా ఉంది. ఒకే ఇంటి పేరున ఉన్న వ్యక్తుల పేర్లపై వెండర్ ఖాతాలు ఉండటంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇ-గ్రామస్వరాజ్ వెండర్ ఖాతాలపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తేనే అసలు విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ పంచాయతీల్లో పలు అంశాలపై సమాచారం హక్కుచట్టం ద్వారా దరఖాస్తు చేసినా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితులు సైతం ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో తమకు అనుకూల వ్యక్తులు ఉన్నారని, తమకు ఏమీ కాదనే ధీమాతోనే వారు ఈ విధంగా ముందుకు సాగుతున్నారనే ప్రచారం సాగుతోంది. దీనిపైనా ఉన్నతాధికారులు విచారించి పంచాయతీల్లోని ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమయ్యాయో, లేదో తేల్చాల్సి ఉంది.

వెండర్ ఖాతాలను తనిఖీ చేస్తారా?

ఏలూరు జిల్లాలో 27 మండలాల్లో 547, పశ్చిమగోదావరిలో 20 మండలాల్లో 409 గ్రామ పంచాయతీలు వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు విడతలుగా రెండు జిల్లాల్లోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.వంద కోట్లకుపైగా విడుదలయ్యాయి. పంచాయతీల్లో ఆ నిధులు ఏ పనులకు ఉపయోగిస్తున్నారో తనిఖీలు మాత్రం ఉండటం లేదు. వెండర్ ఖాతాలపై పంచాయతీల్లో తనిఖీలు నిర్వహిస్తే చాలా విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పంచాయతీ అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి. ప్రతియేటా పంచాయతీల్లో ఆడిట్ ప్రక్రియ జరుగుతోంది. అక్కడ వెండర్ ఖాతాలను ఏవిధంగా గుర్తించలేదో అర్థం కావడంలేదు. వెండర్ ఖాతాలు నిబంధనల ప్రకారం ఉన్నాయో, లేదో కూడా తేల్చాల్సి ఉంది.

విచారణ చేసి నిజమని తేలితే చర్యలు

కెపి.చంద్రశేఖర్, డిఎల్‌పిఒ

ఉద్యోగి పేరున వెండర్ అకౌంట్ చేయడం నిబంధనలకు విరుద్ధం. 15వ ఆర్థిక సంఘం నిధులు శాశ్వత పనులకు ఖర్చు పెట్టాలి. క్రొవ్విడి, మండలపర్రు, గుణపర్రు పంచాయతీల వెండర్ ఖాతాల విషయం నా దృష్టికి రాలేదు. విచారణ చేసి నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

వచ్చే నెలాఖరులోపు నూరుశాతం రుణాలివ్వాలి

ఎస్‌సిలకు రూ.22.38 కోట్లు, బిసిలకు రూ.39.61 కోట్లు

బిసియేతర అల్పాదాయ వెనుకబడిన కులాలకు రూ.7.1 కోట్లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ద్వారా వివిధ తరగతుల ప్రజలకు అందించే రుణాలను బ్యాంకర్లు నూరు శాతం మంజూరు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాయలంలో బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల ద్వారా వివిధ తరగతులకు మంజూరు చేసే రుణాలపై ఎస్‌సి, బిసి కార్పొరేషన్లు, ఎల్‌డిఎం, డిఆర్‌డిఎ, మెప్మా, పరిశ్రమల శాఖల అధికారులు, వివిధ బ్యాంకర్లతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎస్‌సి, బిసిల అభ్యున్నతికి స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఇ పథకాల కింద వివిధ రకాల సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎస్‌సి, బిసిల అభ్యున్నతికి ఎస్‌సిలకు 714 యూనిట్లకు రూ.22.38 కోట్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తారన్నారు. సెర్ఫ్ ద్వారా 120 ఆటోలను మంజూరు చేస్తారని తెలిపారు. బిసిల స్వయం ఉపాధి పథకాలకు 1,901 మందికి రూ.36.49 కోట్లు, జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 39 యూనిట్లకు రూ.3.08 కోట్లు, బిసియేతరులైన వారికి స్వయం ఉపాధి పథకాల కింద 215 మందికి రూ.3.73 కోట్లు, జనరిక్ మెడికల్ దుకాణాల ఏర్పాటుకు 35 యూనిట్లకు రూ.2.92 కోట్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు కాపు కార్పొరేషన్ ఎంఎస్ఎంఇ పథకం 694 యూనిట్లను నెలకొల్పేందుకు రూ.13.88 కోట్లు రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఎస్‌సిలకు మంజూరు చేసే రుణాల్లో మూడు, నాలుగు చక్రాల ప్యాసింజర్ ఆటోలు, నాలుగు చక్రాల గూడ్స్ ట్రక్, పాడి గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, హోటల్ క్యాటరింగ్, శారీ పాలిషింగ్, రోలింగ్, బ్యూటీపార్లర్, ఫొటోస్టూడియో, టూరిజం ఫొటోషూట్, వెజిటబుల్ షాప్, సెల్‌ఫోన్ రిపేర్ షాప్, ఫ్యాన్సీ షాప్, ఐస్‌క్రీమ్ పార్లర్, మెటల్ బ్రాస్ యూనిట్, మొబైల్ ఫుడ్ స్టాల్, జ్యూట్‌బ్యాగ్ మేకింగ్, టెక్స్‌టైల్ యూనిట్, పవర్ టిల్లర్, మినీదాల్, రైస్‌మిల్, ట్రాక్టర్ తదితర యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకు లింకేజీ రుణాలను రూ.10 లక్షల వరకు అందజేస్తారన్నారు. ఆసక్తి గల వారు ఒబిఎంఎంఎస్ పోర్టల్‌లో ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 20 నుండి 24 వరకు మండల, మున్సిపల్ అధికారులు బ్యాంకర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. 26, 27 తేదీల్లో దరఖాస్తుల తిరస్కరణ ఉంటే తెలియజేస్తారని, లక్ష్యానికి అనుగుణంగా అవకాశం ఉంటే కొత్తవారిని చేర్చుతారని తెలిపారు. ఈ నెల 28 నుండి ఫిబ్రవరి 12 వరకు వివిధ దశల్లో అనుమతి పొందిన అనంతరం బ్యాంకులకు డాక్యుమెంట్స్ సమర్పిస్తారన్నారు. ఫిబ్రవరి 21 నుండి 26 మధ్య నియోజకవర్గాలవారీ షెడ్యూల్ ప్రకారం రుణమేళాలు నిర్వహించి ప్రజాప్రతినిధుల ద్వారా అందజేస్తారన్నారు. సమావేశంలో ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.విజయ ప్రకాష్, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎంఎస్.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, మెప్మా అధికారి నాని బాబు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల జాబితా పున్ణపరిశీలన

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పున్ణపరిశీలన చేయాలని సిసిఎల్‌ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. అమరావతి నుంచి ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 57 శాతం పరిశీలన జరిగిందన్నారు. సమావేశంలో ల్యాండ్ సెక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, కోఆర్డినేషన్ సెక్షన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

'జలజీవన్ మిషన్' పనులపై ఆగ్రహం

జెడ్‌పి స్టాండింగ్ కమిటీల్లో అధికారుల తీరుపై ఎంఎల్‌ఎలు అసహనం

రోడ్ల పనులు ఆలస్యంపైనా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జలజీవన్ మిషన్ పనుల్లో జాప్యంపై ఎంఎల్‌ఎలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలు బుధవారం జరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన సాగిన ఈ సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎలు పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, బడేటి చంటి, మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు జలజీవన మిషన్ పనులపై మాట్లాడారు. పైపులు వేసి వదిలేశారని, పనులు చేయకపోయినా కాంట్రాక్టర్లను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవసరమైతే టెండర్లు రద్దుచేసి కొత్తగా పిలిచి పనులు ముందుకు సాగించాలన్నారుఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతికి రోడ్లపై గుంతలు పూడ్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండగా ఇంకా అనేక రోడ్ల పనులు పూర్తి కాలేదన్నారు. ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. పనుల ఆలస్యంపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు పూర్తి చేయనున్నట్లు అధికా రులు తెలిపారు. పలు అభివృద్ధి పనులపై చర్చ సాగింది. వైసిపి సభ్యులు ఛైర్‌పర్సన్‌పై గుర్రుగా ఉండటంతో సమావేశాలు సాఫీగా సాగుతాయా అనే అనుమానాలు నెలకొన్నాయి. కోరం ఉండటంతో ఇబ్బంది లేకుండా పోయింది. దీంతో పలు బిల్లులకు ఆమోదం లభించింది. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన అభిప్రాయ సేకరణ

విద్యుత్ రుసుము ప్రతిపాదనలపై అభిప్రాయం తెలపాలి - విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథబాబు

ప్రజాశక్తి - భీమవరం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ రుసుముల ప్రతిపాదనలపై ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజు బుధవారం కొనసాగింది. స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎస్ఇ కార్యాలయంలో వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ రఘునాథబాబు మాట్లాడుతూ విద్యుత్ రుసుములకు సంబంధించిన ప్రతిపాదనలపై ఎవరికివారు అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. అభిప్రాయాలు తెలిపే వారు ముందుగా పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. నలుగురు వినియోగదారులు పేర్లు నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు, ఐస్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మంతెన ఆంజనేయరాజు, బిహెచ్.సత్యనారాయణరాజు, పివిఎస్.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభిప్రాయ శాఖలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథబాబు

విద్యుత్ సెక్షన్ల పేర్లు మార్పు

జిల్లాలోని విద్యుత్ సెక్షన్ల పేర్లలో మార్పులు చేసినట్లు ఎస్ఇ ఎ.రఘునాథబాబు తెలిపారు. ఇటీవల భీమవరం వచ్చిన సంస్థ సిఎమ్‌డి పృథ్వీతేజ్ సూచనల మేరకు వివిధ సెక్షన్లకు ఆయా ప్రాంతాల పేర్లు పెట్టినట్లు చెప్పారు. పాత, కొత్త పేర్ల వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు సూచన మేరకు నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వీరవాసరం సెక్షన్‌ను భీమవరం నియోజకవర్గంలో చేర్చడంతోపాటు తాడేరు, పాలకోడేరు, వీరవాసరం సెక్షన్లతో కొత్తగా పాలకోడేరు సబ్‌డివిజన్ ఏర్పాటు చేశామన్నారు. పెనుగొండ సబ్‌డివిజన్‌ను ఆచంట నియోజకవర్గంలో చేర్చి ఆచంట సబ్ డివిజన్‌గా మార్పు చేసినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం రూరల్ సబ్ డివిజన్ పేరును పెదతాడేపల్లిగా మార్పు చేసినట్లు చెప్పారు. భీమవరం డి1-ఇండస్ట్రియల్ ఎస్టేట్, భీమవరం డి2-ఎస్ఆర్ నగర్, భీమవరం డి3-ప్రకాశం చౌక్, భీమవరం రూరల్-తాడేరు, నరసాపురం రూరల్-సీతారామపురం, ఆకివీడు రూరల్-గుమ్ములూరు, నరసాపురం టౌన్-నరసాపురం, పాలకొల్లు టౌన్-పాలకొల్లు, పాలకొల్లు రూరల్-పూలపల్లి, తాడేపల్లిగూడెం నార్త్- హౌసింగ్ బోర్డు కాలనీ, తాడేపల్లిగూడెం సౌత్-భాగ్యలక్ష్మిపేట, తాడేపల్లిగూడెం ఎస్ఎస్-పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్-కుంచనపల్లి, తణుకు రూరల్-తేతలి, తణుకు టౌన్-తణుకు, తణుకు డి2-ఎన్‌జిఒస్ కాలనీగా పేర్లు మార్పు చేసినట్లు వెల్లడించారు.

జెసిని సత్కరిస్తున్న సభ్యులు

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు

ప్రధానోపాధ్యాయులకు జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మార్టేరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో నరసాపురం డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇప్పటికి పదో తరగతి పరీక్షలకు 52 రోజులు మాత్రమే సమయం ఉదని, ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారో గుర్తించి దానిపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి అంతా కచ్చితంగా ఉత్తీర్ణులయ్యేలా సిద్ధ: చేయాలని సూచించారు. డిఇఒ నారాయణ మాట్లాడుతూ పాఠశాలలవారీగా ఎస్ఎ-1, ఎస్ఎ-2ల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలపై సమీక్షించారు. విద్యార్థి వెనుకబడటానికి కారణాలను అన్వేషించి ప్రణాళికాబద్ధంగా స్టడీ క్లాసులు నిర్వహించాలని, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని ఆయన కోరారు. ఈ 52 రోజులు అన్ని పాఠశాలలను ఎంఇఒలు, డివైఇఒలు తనిఖీ చేస్తారని, విద్యార్థులకు అదనపు తరగతులను సక్రమంగా నిర్వహించి సత్ఫలితాలు పొందాలని సూచించారు. సమావేశంలో తణుకు డివైఇఒ మురళీశ్రీనివాస్ సత్యనారాయణరెడ్డి, ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, పి.పుష్పరాజ్యం, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు నేలపాటి వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల నిర్వహణ అభినందనీయం

ఎస్ఐ హెచ్.నాగబాబు

ప్రజాశక్తి - ఆకివీడు

దశాబ్దాల తరబడి సంప్రదాయ క్రీడలను ఏ ఆటంకమూ లేకుండా కొనసాగించడం అభినందనీయమని ఆకివీడు ఎస్ఐ హెచ్.నాగబాబు అన్నారు. డివైఎఫ్ఐ 42వ సంక్రాంతి క్రీడోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని దుంపగడప ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు బ్యాటింగ్ చేయగా వైసిపి నేత అంబటి రమేష్ బౌలింగ్ వేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అత్యంత శోభాయానమైన పండుగ సంక్రాంతి అని, ఈ పండుగకు సంప్రదాయ క్రీడలు మరింత శోభను తీసుకొస్తాయని తెలిపారు. అంబటి రమేష్ మాట్లాడుతూ జూదాలకు నిలయంగా మారిన ఈ ప్రాంతాన్ని క్రీడాప్రాంతంగా మార్చడానికి డివైఎఫ్ఐ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వివిగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద మాట్లాడుతూ ఒక ఆశయాన్ని ఏర్పరచుకొని దాని కోసం స్థిరంగా కృషి చేయడం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. క్రీడలు మానసికంగానూ, శారీరకంగానూ మనిషిని అభివృద్ధిలోకి తీసుకెళ్తాయన్నారు. ఎకెపిఎస్ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.బ్రహ్మం మాట్లాడుతూ జూదం, మత్తుపదార్థాలు మనిషిని పతనం చేస్తాయన్నారు. క్రీడల నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన మనిషికి అత్యంత అవసరమని, క్రీడలతో అవి అలవడతాయని అన్నారు. తొలుత డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ సంఘ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ హనుమంతు నాగబాబు

బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న వైఎన్ కళాశాల పాలకవర్గ సభ్యులు

11, 12 తేదీల్లో వైఎన్ ప్లాటినం వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల 75వ సంవత్సరాల (ప్లాటినం) వేడుకలను ఈ నెల 11, 12 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు చెప్పారు. బుధవారం కాలేజీలో వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను పాలకవర్గ సభ్యులు విడుదల చేసి విలేకర్లతో మాట్లాడారు. ఈ వేడుకలకు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు, అహ్మద్ మహమ్మద్ షరీఫ్, ప్రభుత్వ విప్ నాయకర్, ఎంపీలు పురందేశ్వరి, గంటి హరిష్మాదుర్, అప్పలనాయుడు, బాలశౌరి, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు విచ్చేస్తున్నట్లు చెప్పారు. వీరితో పాటు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు సోమయాజులు, గ్రంధి భవాని ప్రసాద్, ఐఎఎస్ అధికారులు కృష్ణబాబు, కన్నబాబుతోపాటు కళాశాలలో చదివి దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా ఈ వేడుకలకు హాజరవుతారన్నారు. ఇప్పటి వరకూ 500 మంది పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన చెప్పారు. 1949లో ఏర్పడిన కళాశాల అంచెలంచెలుగా ఎదిగి అటానమస్‌గా అభివద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో ఈ కాలేజీని డీన్ యూనివర్సిటీగా మార్చాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆ దిశగా పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. వేడుకల్లో భాగంగా నాయకులతో ప్రసంగాలతో పాటు కళాశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధ్యాపకులను సత్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో పొన్నమండ రామకృష్ణ, అందే సతీష్, పోలిశెట్టి రఘురామారావు, రెడప్ప ధవేజీ, గుడివాడ సాయి, రంగినీడి సుబ్బారావు, కోటిపల్లి వెంకటేశ్వరావు, ప్రిన్సిపల్ కనకరావు, పీజీ డైరెక్టర్ చింతరావు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

318 గ్రామాల్లో 4,560 అర్జీల స్వీకరణ

ఇప్పటికే 1,229 అర్జీలు పరిష్కారం

45 రోజుల్లో పెండింగ్ అర్జీల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 27 రోజులపాటు 318 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 4,560 అర్జీలను స్వీకరించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డిసెంబర్ 13 నుండి చేపట్టిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయని తెలిపారు. అర్జీల్లో ఇప్పటికే 1,229 పరిష్కరించగా, ఇంకా 3,331 పరిష్కరించాల్సి ఉందన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం 45 రోజులు గడువు విధించిందని, నిర్దేశిత సమయంలోగా నూరుశాతం అర్జీలను పరిష్కరిస్తామని తెలిపారు. భీమవరం డివిజన్లో 1,333 అర్జీలకుగాను 239, నరసాపురం డివిజన్‌లో 2,079కి 508, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 1,148కి 482 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. సదస్సుల్లో ముఖ్యంగా మ్యుటేషన్, పాస్‌బుక్స్ జారీ, రీసర్వేలో భూవ్యత్యాసాలు, 22 ఎ కేసుల్లో నిషేధిత భూములు తొలగింపు తదితర భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలను అందజేశారని తెలిపారు. గ్రామ సభలను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతిఒక్క అధికారికి, సభలను సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రజలకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

జగన్‌ను కలిసిన మెర్లిన్

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్ వైసిపి అధ్యక్షుడు, మాజీ జగన్మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెర్లిన్‌ను జగన్ ఆప్యాయంగా పలకరించి, స్థానిక విషయాలను గురించి అడిగి తెలుసుకున్నట్లు మెర్లిన్ తెలిపారు. పార్టీకి మంచి రోజులు వస్తాయని ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని, కేసులకు భయపడొద్దని, పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని, ఏ కష్టం వచ్చినా తనను నేరుగా కలవాలని ధైర్యం చెప్పారని మెర్లిన్ పేర్కొన్నారు.

రీసర్వేకు ప్రజలంతా సహకరించండి : తహశీల్దార్

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో జరిగే రీసర్వేకు ప్రజలందరూ సహకరించాలని తహశీల్దార్ కావలి నాగార్జున అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ నుంచి రీసర్వేపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి నాగార్జున మాట్లాడుతూ రీసర్వే జరిగే సమయంలో రైతులు ప్రజలు తమ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులకు చూపించి కొలతలు సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. సర్వేలో ఏమైనా తేడాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, వార్డు సభ్యులు ముగ్గళ్ల సత్యనారాయణ, నాయకులు సూరవరపు వెంకటాచార్యులు, కప్పర కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ:పైలెట్ ప్రాజెక్టు భూ రీసర్వేను ప్రారంభిస్తున్నామని ఈ నెల 20వ తేదీ నుంచి పోలమూరు ప్రతి రైతుకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లోని సర్వేర్, విఆర్ఒ సమక్షంలో పరిశీలిస్తామని తహశీల్దార్ అనితకుమారి అన్నారు. ఈ సందర్భంగా దేవ పంచాయతీ పరిధిలో జరుగనున్న సభలో రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతి రైతు దగ్గరుండి సమస్యలను అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నల్లూరి సత్యనారాయణ, వైస్ సర్పంచి సాకా సుబ్రహ్మణ్యం, వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం గొల్లగూడెం సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు పునరుత్పాదక ఇంధనం వనరులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వారికి పవర్ ప్లాంట్‌ను చూపించడం జరిగిందని తెలిపారు. దేశ సుస్థిర అభివృద్ధిలో వాటి ప్రాముఖ్యతను తెలియజేసినట్లు తెలిపారు. ప్లాంటు సైట్ ఇంజనీర్ కె.నాగపెద్దిగాంగారావు, సైట్ ఎగ్జిక్యూటివ్ సిహెచ్ రాజు సోలార్ శక్తి ఉత్పత్తి విధానం ఫోటో వోల్టాయిక్ టెక్నాలజీ శక్తి ప్రసరణ గురించి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, కెవి.గణేశ్‌కుమార్, కె.గిరిబాబు, లక్ష్మీకుమారితో పాటు 37 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

పాలకొల్లు రూరల్:మండలంలోని పూలపల్లి ఈడావారిపేట, కొత్తపేట, గోరింటాడ గ్రామాల్లో కొంతకాలంగా లోవోల్టేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కారంలో భాగంగా ఆయా గ్రామాల్లో 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని పాలకొల్లు ఎలక్ట్రికల్ డిఇ సిహెచ్ రామకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా కొత్తపేటలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను సర్పంచులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలపై విద్యుత్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సర్పంచి కొరు భారతి భాస్కరరావు, గోరింటాడ సర్పంచి మండేల పావనినాని, రూరల్ ఎఇ శ్రీనివాసరావు, కెవి విజయభాస్కర్, సైట్, పాముల రజినీకుమార్, కొరు మురళి, గెద్దాడ గోపీకృష్ణ పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన నాయకర్

నరసాపురం:మంగళగిరి క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గంలోని సమస్యలను క్లుప్తంగా వివరించి, పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి లోకేష్‌ను నాయకర్ కోరారు.

ముత్యాలమ్మకు రూ.8.81 లక్షల ఆదాయం

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయం 8,81,748 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. యాత్రికులు 48 రోజులుగా అమ్మవారికి, కానుకలు, బిల్లలు రూపంలో సమర్పించుకున్న ఆదాయాన్ని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆకివీడు.రామచంద్రరావు, మొగల్తూరు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌తోనే సృజనాత్మకత : ఎంఎల్‌ఎ అంజిబాబు

భీమవరం టౌన్:భీమవరంలోని విశ్వకవి సిబిఎస్‌ఇ స్టేట్ సిలబస్ స్కూల్లో మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన మ్యాథ్స్ అండ్ సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి మాట్లాడారు. విశ్వకవి స్కూల్లో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఐఎఎస్, ఐపిఎస్, డాక్టర్లు, ఇంజినీర్లుగా అత్యున్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఇటువంటి సైన్స్ ఫేర్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయొచ్చని తెలిపారు. విశ్వకవి స్కూల్ డైరెక్టర్ పొట్టూరి రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ అంజిబాబు దాదాపు 34 సంవత్సరాలుగా విశ్వకవి విద్య సంస్థకు ఉన్న మిత్రులన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, చినఅమిరం గ్రామ మాజీ సర్పంచి బుద్ధరాజు శ్రీనివాసరాజు, రాయలం మాజీ సర్పంచి కోళ్ల రామచంద్రరావు, రాయలం పత్తి హరివర్దన్, శివకృష్ణ పాల్గొన్నారు.

లేహం కంపెనీకి అనుమతిచ్చింది కారుమూరి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

మండలం తేతలి గ్రామ పరిధిలో ఉన్న లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పర్మిషన్లు ఇప్పించింది మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తణుకులోని ఎంఎల్‌ఎ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై జరుగుతున్న చర్చకు సంబంధించిన మాజీ ఎంఎల్‌ఎ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అర్థ రూపాయికి రూపాయన్నర యాక్షన్ చేస్తున్నారని విమర్శించారు. కారుమూరి నాగేశ్వరరావు నీ చరిత్ర అంతా తెలుసని, ఎక్కడెంతం వచ్చి ఎక్కడ ఉంటున్నావని, తమరు ఏమిటన్నది పెట్టు, తెలిసి తెలిపారు. అబద్దాలు చెప్పడంలో ఆరితేరిపోయావని, ప్రజల్ని చులకనగా మాట్లాడొద్దని, రైతులను ఎర్రి పప్పని అనుకోబోయించడం వల్ల నియోజకవర్గ ప్రజలందరూ బుద్ధి చెప్పారని విమర్శించారు. తాను 2014 నుంచి 2019 వరకూ డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌తో సహా ఇవ్వగలనని తెలిపారు. మీ హయాంలో ఫ్యాక్టరీ మూసి వేయడానికి డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఆ ఫ్యాక్టరీని అపినట్లు ఎవిడెన్స్ ఉంటే నేను నీకు క్షమాపణలు చెబుతానని తెలిపారు. మీరు చేసిన తప్పులను మాపై రుద్దుతున్నారన్నారు. ఈ ఫ్యాక్టరీ 2013లో ఆర్డర్ పొందింది కారుమూరి అని, ఆయన కనుసన్నల్లో ఆయన పార్టీకి చెందిన వ్యక్తులు డైరెక్టర్లుగా ఈ కంపెనీలో జాయిన్ అవ్వడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 2014లో కారుమూరి కాంగ్రెస్ ఎంఎల్‌ఎగా ఉన్నారని తదవాత నేను శాసనసభ్యులుగా ఎన్నికైనప్పుడు ఆ ఫ్యాక్టరీలో వెజిటబుల్, మీట్ ప్రాసెసింగ్ అని చెప్పి అప్లై చేయడం జరిగిందన్నారు. ఆ తరువాత 2016లో పంచాయతీ తీర్మానం మా దృష్టిలో లేకుండా సదరు పంచాయతీ తీర్మానాన్ని క్యాన్సిల్ చేయించడం జరిగిందన్నారు. డిసెంబర్ 2015 లో దీనికి సంబంధించి నేను అప్పట్లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జిల్లా స్థాయి మీటింగ్‌లో కూడా మాట్లాడటం జరిగిందని తెలిపారు. ఉత్తరప్రదేశ్ వ్యాపారులతో నువ్వు వ్యాపారాలు పెట్టుకుని ప్రజల తరఫున మాట్లాడుతున్నావా అని తెలిపారు. ఈ ఫ్యాక్టరీపై స్పందించి చర్యలు తీసుకునే విధంగా తాము చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు

తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి

ప్రజాశక్తి - నరసాపురం

రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా జరిపిన చిట్‌చాట్‌లో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

చిట్‌చాట్

ప్రశ్న : నరసాపురంలో పట్టభద్రుల ఓట్లకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్నింటిని తిరస్కరించారు?

నరసాపురంలో పట్టభద్రుల ఓట్లకు 6,771 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,280 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. తుది జాబితాలో మొత్తం 5,490 ఓట్లు వచ్చాయి.

ప్రశ్న: ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయా?

నరసాపురం మండలం, పట్టణంలో మొత్తం 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి.

ప్రశ్న : రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు అందాయి? ఇప్పటివరకూ ఎన్ని పరిష్కరించారు?

17 రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 450 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఇప్పటికే 102 ఫిర్యాదులను పరిష్కరించాం.

ప్రశ్న : రెవెన్యూ సదస్సుల్లో ఏ గ్రామం నుంచి ఎక్కువ ఫిర్యాదులు అందాయి? ఏ గ్రామం నుండి తక్కువ ఫిర్యాదులు అందాయి?

రెవెన్యూ సదస్సుల్లో వేములదేవి నుండి ఎక్కువగా 115 ఫిర్యాదులు అందాయి. గొంది గ్రామం నుంచి 4 ఫిర్యాదులు మాత్రమే అందాయి.

ప్రశ్న : మీ పరిధిలో ఎంతమంది విఆర్ఒలు ఉండాలి? ఎంత మంది ఉన్నారు? ఏయే గ్రామాల్లో లేరు?

నరసాపురం రెవెన్యూ పరిధిలో 38 మంది విఆర్ఒలు ఉండాలి. 33 మంది ఉన్నారు. కొప్పర్రు, తూర్పుతాళ్లు, వేములదేవి వెస్ట్, ఈస్ట్, పిఎంలంక గ్రామాల్లో విఆర్ఒలు లేరు. ఈ గ్రామాలకు ఇన్‌ఛార్జి విఆర్ఒలను నియమించాం.

ప్రశ్న : ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు? మిగిలిన గ్రామాల్లో ఎప్పుడు చేపడతారు?

మండలంలో ఏడు గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. త్వరలో మల్లవరం గ్రామంలో చేపట్టనున్నాం.

ప్రశ్న : మొత్తం ఎనిన రేషన్ కార్డులు ఉన్నాయి? ఎన్ని రేషన్ షాపులు ఉన్నాయి, ఎన్ని వాహనాలు ఉన్నాయి?

మొత్తం 41,659 రేషన్ కార్డులు ఉన్నాయి. 90 రేషన్ దుకాణాలు, 26 రేషన్ వాహనాలు ఉన్నాయి.

ప్రశ్న : రేషన్ డీలర్లకు మీరిచ్చే సూచన ఏమిటి?

రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్టాక్ నిల్వల్లో తేడాలు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

విజయమోహన్ నైపుణ్యం అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

కొప్పినీడి విజయమోహన్ సూక్ష్మ కళలో నైపుణ్యం సాధించడం అభినందనీయమని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత విజయమోహన్ బుధవారం కొవ్వలి రామ్మోహన్ నాయుడును ఆయన నివాసంలో కలిసి తాను పెన్సిల్‌తో గీసిన కొవ్వలి రామ్మోహన్‌నాయుడు చిత్రాన్ని, దాంతోపాటు బియ్యం గింజలపై చెక్కిన ఆయన పేరును బహూకరించారు. ఈ సందర్భంగా తాను ఈ కళా నైపుణ్యంలో సాధించిన అవార్డులు, రివార్డులను నాయుడుకి వివరించారు. దీనిపై స్పందించిన కొవ్వలి మాట్లాడుతూ మైక్రో చిత్రకళలో నైపుణ్యం సాధించిన వారు వేళ్లపై లెక్కించవచ్చని తెలిపారు. ఓర్పు నేర్పు సూక్ష్మ దృష్టి ఉంటేనే ఇది సాధ్యమన్నారు. ఏకాగ్రతతో చేసే పనికి చిత్రకళ నైపుణ్యం ఒక మచ్చుతునకగా అభివర్ణించారు. ప్రస్తుతం విజయమోహన్ లిఖితపూడి గ్రామ సచివాలయం వద్ద సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ, ఈ సూక్ష్మ కళలో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం విజయ్, విజయ్ తండ్రి వరహాలరావును కొవ్వలి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి బాబ్జి, కావలి నాని, కోటిపల్లి కన్నబాబు, ఆరేటి వేణు, ఆకుల భుజంగరావు, కె.కళ్యాణ్, బండారు విశ్వమోహన్ కుమార్, మేడిద రాము, లక్కు శ్రీను, రేవు పద్మారావు, నండా రామకృష్ణ పాల్గొన్నారు.

కొవ్వలి నాయుడుకు చిత్రపటాన్ని అందిస్తున్న విజయ్‌మోహన్

నీటిని పొదుపుగా వాడాలి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణం 2వ వార్డు శ్రీహరిపేట వద్ద గల ప్రధాన రక్షిత నీటి సరఫరా విభాగాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం పరిశీలించారు. తాగునీటి చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ఆలం, క్లోరిన్ స్టాక్ నిల్వలు పరిశీలించి, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలంతా నీటిని పొదుపుగా వాడుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రవీణ్ చంద్ర, ఎఇ కిషోర్ పాల్గొన్నారు.

మెన్ చెస్ పోటీలకు ఛాంబర్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ కళాశాలలో డిగ్రీ సెకండ్ బిబిఎ చదువుతున్న పులి దుర్గాప్రసాద్ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మెన్ చెస్ పోటీలకు నన్నయ్య యూనివర్సిటీ, రాజమహేంద్రవరం తరపున ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ కాంపిటేషన్లో పులి దుర్గప్రసాద్ నన్నయ్య యూనివర్సిటీ చెస్‌టీమ్‌కు ఎంపికయ్యారని, తద్వారా ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకూ చెన్నయ్‌లో వెల్‌టెక్ యూనివర్సిటీలో జరుగు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మెన్ చదరంగ పోటీలకు పాల్గొనే అవకాశం లభించడం కళాశాలకు గర్వకారణంగా ఉందని కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలిపారు. క్రీడలు సాంస్కృతిక అంశాల్లో కళాశాలలో తమ విద్యార్థులకు ప్రతిభాపాటవాలు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పులి దుర్గాప్రసాద్, పిడి బి.అప్పారావును కళాశాల యాజమాన్యం అభినందించారు.

పేదలకు మందులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పేదలకు మందులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

నిస్సహాయులను ఆదుకోవడంలోనే నిజమైన ఆనందం ఉందని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు అన్నారు. పెదమామిడిపల్లిలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు పేదలకు 12 వేల రూపాయల మందులను ఆయన క్లబ్ తరపున బుధవారం అందజేశారు. మెదడు నరాల వ్యాధితో బాధపడుతున్న కుక్కల వేణుగోపాలస్వామికి 5 వేల రూపాయల మందులు, డయాబెటిస్‌తో బాధపడుతున్న కవురు పెద్దింట్లకు 6 వేల రూపాయల విలువైన మందులను, కవురు ధనలక్ష్మికి కంటి శస్త్ర చికిత్స అనంతరం కళ్ల జోడు క్లబ్ సభ్యులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్‌రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

10 నుంచి ఆదికేశ ఎంబర్‌మన్నార్ ఉత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఆదికేశవ ఎంబర్ మన్నార్ ఆలయంలో ఈ నెల 10 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్త పుప్పాల కృష్ణారావు చెప్పారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా 10న వైకుంఠ ఏకదశి ద్వారా దర్శనం, కూడార్ విశేషం, 13న భోగి కళ్యాణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తమిళనాడు పేరంబదూర్ ఆలయంలో ఏ విధమైన పూజ కార్యక్రమాలు జరుగుతాయో అదే రీతిలో ఇక్కడ పూజలు జరుగుతాయన్నారు. ఆలయానికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అర్చకులు పెద్దింట్ల రామ్మోహన్ ఆచార్యులు, సిబ్బంది టి.వెంకటేశ్వరావులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థుల విద్యాభి వృద్ధికి లయన్స్ క్లబ్ తన వంతు కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. నిడమర్రు మండలం భవాయిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి ఎన్.సుధాకర్‌కు పంజాబ్‌లో ఇంజినీరింగ్ చదివేందుకు ఫీజు నిమిత్తం రూ.50,000 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సుధాకర్ పంజాబ్‌లో లవ్‌లీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడని సుధాకర్ విద్యాభివృద్ధికి క్లబ్ ఆర్థిక సహకారం అందించి సుధాకర్ మరింతగా విద్యలో రాణించడానికి సహరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం క్లబ్ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, కోశాధికారి వి.విశారద, వెల్లంకి నరేష్, కిలారి రవి, రావూరి నాగరాజు పాల్గొన్నారు.

దారిని ఆక్రమించారు.. న్యాయం చేయండి

ఎన్ఆర్ఐ పాలా త్రినాథ్ ఆవేదన

ప్రజాశక్తి - మొగల్తూరు

దేవుడి పేరుతో తన భూమికి వెళ్లే దారిని పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించారని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని ఎన్ఆర్ఐ పాలా త్రినాథ్ బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం వేంద్ర అగ్రహారానికి చెందిన పాలా త్రినాథ్ సుమారు 15 సంవత్సరాల కిందట మొళ్లపర్రులో 63 సెంట్ల భూమిని తన తల్లి పేరు మీద కొనుగోలు చేశారు. సుమారు నాలుగు నెలల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది దుర్గమ్మ ఆలయ కమిటీ పేరుతో రహదారిని ఆక్రమించి చుట్టూ కంచె వేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా కంచె తొలగించలేదు. ఆక్రమణకు గురైన భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు మొగల్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తెలిపారు. తహశీల్దార్ మాత్రం ఆ భూమి జిరాయితీకి చెందినదే అని తెలిపారని చెప్పారు. ఉన్నతాధికారులు చొరవ చూపి కంచె తొలగించి తన భూమికి వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేయాలని త్రినాథ్ కోరారు.

కోడిపందేల నియంత్రణకు గ్రామ కమిటీలు

తహశీల్దార్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కోడి పందేలు, జూదం, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలను నిషేధించినట్లు తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వీటి నియంత్రణకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, మహిళా పోలీస్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో ఈ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ కమిటీలకు ఆదేశాలు జారీ చేశారు.

యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

సంక్రాంతి పండుగ సందర్భంగా యువత కోడిపందేలు, జూద క్రీడలకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ ఎం.కృష్ణ కుమార్ సూచించారు. ఇరగవరం మండలం రేలంగి పంచాయతీ వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని సాంప్రదాయ బద్ధమైన ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించుకుని పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా చేసుకోవాలన్నారు. జూద క్రీడల వల్ల ఆర్థిక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రేలంగి గ్రామ సర్పంచి చేబ్రోలు స్వరాజ్యం, ఇరగవరం ఎస్ఐ జానా సతీష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రూరల్ సిఐ ఎం.కృష్ణకుమార్

15 వరకూ ఫసల్ బీమా నమోదు గడువు పెంపు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు వ్యవసాయ అధికారి కె.కుసుమ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే బీమా వర్తిస్తుందన్నారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు

తణుకు : ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - తణుకు

వివేకానంద గ్లోబల్ స్కూల్ వద్ద సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం ఘనంగా ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల వల్ల సంస్కృతీ సంప్రదాయాల పట్ల విద్యార్థులను ప్రతిబింబించే విధంగా స్కూల్ యాజమాన్యం వారు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు ఈ ముగ్గుల పోటీల్లో, గాలి పటాల పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, స్కూల్ సెక్రటరీ రీనాసాయి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీంద్రనాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి : ఉండి మండలం యండగండి లోని శ్రీవిజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కరస్పాండెంట్ దుగ్గిరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త పెన్మెత్స నాగేంద్రవర్మ మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతో పాఠశాలలో విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులచే మొదటిరోజు రంగవల్లికల పోటీలు నిర్వహించడం జరిగిందని అకడమిక్ ఇన్‌ఛార్జి బుల్లిరాజు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి : ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, ఉన్నత భారత్ అభియాన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులతో బుధవారం వెంకట్రామన్నగూడెంలో విద్యుత్ పొదుపు, సంరక్షణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు విద్యుత్ పొదుపు పద్ధతులు, పునరుత్పాదక శక్తి వనరుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎ.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, కళాశాల కోఆర్డినేటర్లు సల్మాన్ బాషా, కెఎన్.శివ, వాలంటీర్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఇఇఇ విభాగాధిపతి ఎ.ప్రసాద్ అభినందించారు.

ప్రార్థనామందిరం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని దొడ్డనపూడి - పల్లిపాలెంలో నూతనంగా నిర్మించిన సమృద్ధి సువార్త మందిరాన్ని రెవరెండ్ ఎంఎస్‌కె.సాగర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఎమ్‌డి ఇస్మాయిల్ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. అందరం ప్రేమ, అభిమానం, సహనం, ఓర్పు అలవర్చుకోవాలన్నారు. మందిర నిర్మాణానికి సహకరించిన ప్రముఖ దాత, గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు తదితరులను పాస్టర్ వై.సాల్మన్ రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలవపూడి సర్పంచి గేదెల జాన్, వర్తమానికులు రెవరెండ్ పి.ఫిలిప్, బ్రదర్ పాలపర్తి ప్రసాద్, రవి రెడ్డిశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - నరసాపురం

2025 - 26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై బుధవారం ఎపిఇఆర్‌సి చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం ఇఇ కార్యాలయంలో ఇఇ కె.మధు కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలు మాట్లాడేందుకు ఆయన స్క్రీన్ ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ డిజిటల్ స్క్రీన్ ద్వారా ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం రెండు, నాలుగు గంటల వరకూ జరిగే కార్యక్రమంలో వినియోగదారుల ఛార్జీల పెంపుపై తమ అభిప్రాయాలను నేరుగా ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ తెలిపవచ్చున్నారు. అభిప్రాయాలను తెలిపే వారు తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈ నెల 10వ తేదీన అవకాశం అందిస్తారన్నారు. ఇప్పటి వరకూ ఎవరూ పేర్లు నమోదు చేసుకోలేదన్నారు.

మాధవనాయుడుకు గోవిందరావు పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తండ్రి బండారు ప్రతాప్ నాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం మాధవనాయుడును సరిపల్లిలో ఆయన నివాసంలో జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) పరామర్శించారు. ముందుకు ప్రతాప్ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బండారు పటేల్ నాయుడు, కొండేటి శ్రీను, నడిపూడి కృష్ణ పాల్గొన్నారు.

11న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

నాయకర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వలంధర రేవు వద్ద ఈ నెల 11వ తేదీ శనివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకురాలు బొమ్మిడి సునీత నాయకర్ తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేస్తామని తెలిపారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పత్రిక ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు దివ్య సముఖమునకు

GWOP.No.36/2024

మధ్య
గిద్దా శ్రీనివాసు ...పిటీషనరు
మరియు
గిద్దా కార్తికేయ (మైనరు)
మైనరు తరపున గార్డియన్ అయిన తల్లి
గిద్దా నాగసుధ అనే సజ్జా నాగసుధ
...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటిషనులో నా క్లయింటు గిద్దా శ్రీనివాసు అను వ్యక్తి మీపై గార్డియన్ పిటిషనును ది.4-10-24 తేదీన దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో శ్రీకోర్టు వారు జనరల్ నోటీసు ప్రకటన వేయమని ఆదేశించగా ఈ ప్రకటన ద్వారా తమకు వాయిదా ది.**10-2-2025** తేదీన వాయిదా అని తెలియ జేయుచూ GWOP.36/2024 లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు స్వయముగా కాని వకీలు ద్వారా కాని ఉదయం 10.30 నిమిషాలకు హాజరయి తెలియపరచవలసినదిగా తెలియ జేయడమైనది. లేనిఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

Palepu Venkata Satyanarayana
Advocate,
తాడేపల్లిగూడెం. Tadepalligudem.
తేది. 2-1-2025 Cell: 9963346059.